క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో మహేంద్రకు 99.96 శాతం


సోహాన్ మహేంద్ర

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన వాణిజ్య పన్నుల శాఖ అధికారి దారబాల సత్యనారాయణ కుమారుడు సోహాన్ మహేంద్ర జేఈఈ మెయిన్స్‌లో 99.96 శాతం సాధించారు. జాతీయ స్థాయి ఇంజినీరింగ్ కాలేజీలో ప్రవేశానికి ఈ ఏడాది నిర్వహించిన జేఈఈ మెయిన్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచాడు. గతంలో పదో తరగతి పరీక్షల్లో కూడా 586 మార్కులు సాధించాడు.

ఈ-క్రాప్ నమోదు చేయించండి

పిఠాపురం: పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించాలని గొల్లప్రోలు ఏడీఏ పి.స్వాతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ-క్రాప్ నమోదు ప్రారంభించామని, రైతులందరూ తమ పంటలను ఆర్బీకేల వద్ద ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్, సీసీ ఆర్డీ కార్డుతో వెళ్లాలని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది ఆయా గ్రామాల పరిధిలో ఈ-క్రాప్‌పై రైతులకు సమాచారం ఇచ్చారని చెప్పారు. పీఎం కిసాన్ పథకానికి కేంద్ర ప్రభుత్వం ఈ-కేవైసీని తప్పనిసరి చేసిందని వివరించారు. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు.

టిడ్కో లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అరుణ తదితరులు

సామర్లకోట: స్థానిక టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి లబ్ధిదారుల పేరున ఇంటిని రిజిస్టర్ చేశామని, వారికి రుణాలు అందజేయాలన్నారు. బ్యాంకు సిబ్బంది ఆయా లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించవచ్చని వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైస్ చైర్మన్-2 గోకిన సునేత్రాదేవి, మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత, మున్సిపల్ కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు, పితాని కృష్ణ తదితరులతో పాటు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

చురుగ్గా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

కొత్తపల్లి: నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇప్పటి వరకూ 2,069 పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసినట్టు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వం ఇచ్చిన 4,623 ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా, సుమారు 50 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయన్నారు. పట్టాలు పొందిన ప్రతిఒక్కరూ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. సరిహద్దులు తప్పులు వచ్చినా, వాటిని సవరించేందుకు గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు.

ఇరు వర్గాలపై ఘర్షణ కేసు

కొత్తపల్లి: ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాలకు చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. అమీనాబాదు గ్రామానికి చెందిన ఓసుపల్లి ఇస్సాక్, అదే గ్రామానికి చెందిన రామిశెట్టి జ్యోతిబాబు కుటుంబ తగాదా విషయమై సోమవారం గ్రామ పెద్దల వద్దకు వెళ్లారు. ఇద్దరి మధ్య సయోధ్య కుదరకపోవడంతో పాటు, ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. వారు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేశారు.

రోజుకు వెయ్యి లీటర్ల పాలు కొనుగోలు

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న పాల వెల్లువ కేంద్రాల ద్వారా రోజుకు సుమారు వెయ్యి లీటర్ల పాలను కొనుగోలు చేస్తారని పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ తెలిపారు. ఎండపల్లిలోని జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మండలంలో పది జగనన్న పాల వెల్లువ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. మహిళా డెయిరీ సహకార సంఘాల ద్వారా పాలను కొనుగోలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కేంద్రాలకు పాలుపోసే రైతులకు ప్రభుత్వం రెండు రకాల రుణ సదుపాయాన్ని కల్పిస్తుందన్నారు. పాడి రైతులకు అన్ని విధాలా ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక ప్రయోజనాలను కల్పిస్తోందన్నారు. ప్రైవేటు కేంద్రాల కంటే జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో అధికంగా ధర చెల్లిస్తున్నట్టు తెలిపారు.

మంచుతోంది

అన్నదాతకు వ్యవసాయం నిత్య యుద్ధంలా మారింది. కరుణించాల్సిన ప్రకృతి కన్నెర్ర చేస్తుంటే.. రైతన్న దిక్కుతోచని పరిస్థితిలో అల్లాడుతున్నాడు. తాజాగా పంటలపై విపరీతంగా కురుస్తున్న మంచు ధాటికి తెగుళ్లు విజృంభిస్తున్నాయి. ఏం చేయాలో పాలుపోని రైతులకు.. వ్యవసాయాధికారుల సూచనలు కాస్తంత ఊరటనిస్తున్నాయి.

- విజృంభిస్తున్న తెగుళ్లు
- పంటలపై తీవ్ర దుష్ప్రభావం
- సస్యరక్షణ చర్యలే దిక్కంటున్న నిపుణులు


తెగుళ్లు సోకిన పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పిఠాపురం: బారెడు పొద్దెక్కినా పచ్చని పంటలు కనిపించనంతగా కురుస్తున్న మంచు పంటలను ముంచుతోంది. దానికి తోడు ముదురుతున్న ఎండలు పంటలకు మరింత నష్టాన్ని కలిగించేలా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది రబీలో ఆదిలోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. విజృంభిస్తున్న తెగుళ్లు ఎనలేని భారాన్ని మోపుతున్నాయి. రబీసాగుపై తెగుళ్లు ముప్పేట దాడి చేస్తున్నాయి. ఓవైపు ఎండలు ముదురుతుండడంతో సుడిదోమ విజృంభిస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనేక కష్టనష్టాలతో రబీ సాగుకు సిద్ధమైన రైతుకు సాగునీటి సమస్య అంతగా లేకపోయినా, ఎడతెరిపి లేకుండా ఒకదానిని మించి తెగుళ్లు వ్యాపిస్తుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. నాట్లు వేసిన నాటినుంచీ తెగుళ్లకు రసాయన మందుల వాడకంతో రైతులపై అదనపు భారం తప్పడం లేదు.

తెగుళ్లకు అనేక కారణాలు

పిఠాపురం నియోజకవర్గంలో ఏలేరు పీబీసీ పరిధిలో 13,800 హెక్టార్లలో రబీ వరిసాగు చేపట్టారు. వీటిలో ఎక్కువగా 120 రోజుల కాల పరిమితి ఉన్న సన్న రకాలను వేసినట్టు వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరిపైరుపై దోమ, అగ్గితెగులు, ఆకుముడత, పసర, పురుగు, కాండం తొలుచు పురుగు, పిండినల్లి, ఎర్ర నల్లి, ఆకుచిట్టు,పురుగు, దుబ్బుకుళ్లు, రసం పీల్చు పురుగు వంటివి విజృంభిస్తున్నాయి. వాతావరణం ప్రతికూలంగా ఉండడంతో పాటు, నాట్లు ఆలస్యం కావడం, సాగునీరు సక్రమంగా అందకపోవడం తదితర సమస్యలే కారణంగా రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా వెదజల్లే పద్ధతిలో వేసిన వరిపై వ్యాధుల తీవ్రత అధికంగా ఉన్నాయంటున్నారు. అలాగే నాట్లు వేసిన వరిపైరు పైనా కొన్ని తెగుళ్లు ఆశించడంతో పురుగు మందులు పిచికారీ చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. ఎన్ని మందులు వాడినా వ్యాధుల తీవ్రత తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం మంచు అధికంగా కురుస్తుండడంతో తెగుళ్లు మరింత తీవ్రమయ్యాయి.

తగిన మందులతో నష్ట నివారణ

వ్యవసాయశాఖాధికారుల సూచనలు, సలహాలు పాటించి, తగిన పురుగు మందులు వాడడం వల్ల నష్టాలను నివారించుకోవచ్చని పిఠాపురం వ్యవసాయశాఖాధికారి అచ్యుతరావు తెలిపారు. తెగుళ్లను తొలి దశలోనే గుర్తించి, తగిన మందులు పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం మంచు ప్రభావంతో అగ్గితెగులు, దుబ్బుకుళ్లు, కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఆశిస్తున్నాయన్నారు. ఆలస్యంగా వరినాట్లు వేసిన వారు ఎప్పటికప్పుడు పంటను పరిశీలిస్తూ, ఎక్కడైనా తేడా కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖాధికారులకు సమాచారం ఇచ్చి, వారి సూచనల మేరకు తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. పసుపు రంగు పిట్ట పురుగులు కనిపిస్తే మొవ్వుపడిపోవడం వంటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఆయా రైతులు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకువస్తే, సస్యరక్షణ చర్యలు వివరిస్తామని, తద్వారా పంటలకు నష్టం లేకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. పంటలకు ఎటువంటి తెగుళ్లు సోకినా ఇష్టానుసారం రసాయన మందులు వాడకుండా, వ్యవసాయ శాఖాధికారుల సూచనల మేరకు మాత్రమే మందులు ఉపయోగించడం ద్వారా పెట్టుబడి తగ్గించుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఇష్టానుసారం పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల పెట్టుబడి పెరగడంతో పాటు, పంటలకు రసాయన ప్రభావం ఎక్కువవుతుందని, రైతులకు నష్టం కూడా ఎక్కువగానే ఉంటుందని వివరించారు.


16 నుంచి బషీర్ బీబీ ఉర్స్

ఏర్పాట్లు పరిశీలించిన సీఐ శ్రీనివాస్


పొన్నాడలో ఉర్సు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

కొత్తపల్లి: పొన్నాడలో ఉన్న బషీర్ బీబీ ఉర్స్ ఉత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. బషీర్ బీబీ (బంగారు పాప) దర్గా వద్ద ఉర్స్ ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకూ మూడు రోజుల పాటు నిర్వహిస్తారన్నారు. దర్గా కమిటీ సభ్యులు పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆదివారం జరిగే గంధోత్సవం కీలకమైందన్నారు. ఉత్సవాలకు కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు మండలాల నుంచి సుమారు 150 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహిస్తామని చెప్పారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు తమ పిల్లలను జాగ్రత్తగా గమనించుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. దర్గా వద్ద పోలీసు కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్సై స్వామినాయుడు, పోలీసు సిబ్బంది, దర్గా కమిటీ సభ్యులు ఉన్నారు.

నేడు సరస్వతీదేవికి పూజలు


పంచారామ క్షేత్రంలోని సరస్వతిదేవి


సామర్లకోట పంచారామ క్షేత్రం

- పంచారామ క్షేత్రంలో అభిషేకాలు, హోమం
- పూజా సామగ్రిని సమకూరుస్తున్న దేవస్థానం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని సరస్వతి అమ్మవారి ఆలయం వద్ద వసంత పంచమిని పురస్కరించుకుని విద్యార్థులతో సరస్వతి పూజలు చేయించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా వసంత పంచమి సందర్భంగా ఆలయంలో ఈ పూజలు చేస్తారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ, డి.నాగమల్లే శ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజలు, హోమానికి కావలసిన ఏర్పాట్లు సిద్ధం చేశారు. బుధవారం పంచమి సరస్వతి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని ఉదయం 8.30 నిమిషాలకు విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. పూజా సామగ్రిని దేవస్థానం అధికారులే సమకూరుస్తున్నారు. విద్యార్థులకు దేవి ఫిషరీస్ యాజమాన్యం పుస్తకాలు, మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి పెన్నులు సమకూరుస్తున్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలకు సైతం అధికారులు ఏర్పాట్లు చేశారు.

విద్యాభివృద్ధికి సరస్వతీ పూజ దోహదం



సరస్వతీదేవి జన్మదినమైన శ్రీపంచమి తిథిన ఆమెను పూజిస్తే విద్యాభివృద్ధి జరుగుతుంది. అక్షరాభ్యాసాలకు మంచిరోజు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఏకాగ్రత ఏర్పడే అవకాశం ఉంది.

– వేమూరి సోమేశ్వరశర్మ, పంచారామ క్షేత్ర అభిషేక పండితుడు, సామర్లకోట.

ఏర్పాట్లు పూర్తి..



ఆలయంలో సరస్వతీ పూజలు, అభిషేకాలు, హోమాలకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. పుస్తకాలు, పెన్నులు అమ్మవారి వద్ద ఉంచి పూజల్లో పాల్గొన్న విద్యార్థులకు అందజేస్తాం. ఇప్పటికే పూజల్లో పాల్గొనేందుకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు.

– డి.నాగమల్లేశ్వరరావు, పంచారామక్షేత్ర ఈఓ, సామర్లకోట

మూఢ నమ్మకాలు వదలాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐ

పెద్దాపురం: ప్రతి ఒక్కరూ మూఢ నమ్మకాలను వదలాలని జన విజ్ఞాన వేదిక సైన్స్ అండ్ టెక్నాలజీ కన్వీనర్ బుద్దా శ్రీనివాస్, సీఐ రవికుమార్, ఎస్‌ఐ వి.సురేష్ అన్నారు. జేవీవీ కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ ఆలయం వద్ద వింత జంతువు ఆకారంపై వస్తున్న వదంతులపై బుద్దా శ్రీనివాస్ ఓ ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. సీఐ రవికుమార్ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా వదంతులు నమ్మి ప్రజలు భయభ్రాంతులకు గురి కావదన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- వ్యవస్థలో మార్పుతెచ్చిన సీఎం జగన్
- ఆసరా పంపిణీ సభలో కోఆర్డినేటర్ దవులూరి


వేట్లపాలెం మహిళా సంఘాలకు నమూనా చెక్కు అందజేసిన దవులూరి దొరబాబు


జి.రాగంపేటలో వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న దొరబాబు

సామర్లకోట: మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండల పరిధిలో వేట్లపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద మహిళా సంఘాలకు నాలుగో విడత ఆసరా చెక్కులను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. వైఎస్సార్ క్రాంతిపథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరు వి.ప్రశాంతి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ హుస్సేన్‌పురం, వేట్లపాలెం గ్రామాలకు చెందిన 416 సంఘాలకు నాలుగో విడతగా రూ.3,38,64,259 విడుదల అయ్యాయన్నారు. మండల పరిధిలోని 1645 సంఘాలకు మొత్తంగా రూ.48.75 కోట్ల ఆసరా నిధులు మంజూరైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడువుకు ముందే నాలుగో విడత ఆసరా నిధులు అందజేశారన్నారు. మాటకు కట్టుబడి ఉండే జగన్‌ను జీవితకాలం ముఖ్యమంత్రిగా ఉండేలా చూసుకోవాలన్నారు. లేకుంటే సంక్షేమ పథకాలు ఇచ్చేవారు ఉండరని హెచ్చరించారు. ఈ పథకాలను దుబారా అంటున్న చంద్రబాబు అంతకంటే మంచి పథకాలు అమలుచేస్తాననడం హాస్యాస్పదమన్నారు. స్థానికుడైన తాను వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేస్తున్నానని, ప్రతి ఒక్కరూ ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతానని హామీ ఇచ్చారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, ఎలిశెట్టి నరేష్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్‌చౌదరి, అచ్చంపేట సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, సీనియర్ పార్టీ నాయకులు గోలి బాబ్జీ, ఎంపీటీసీ సభ్యుడు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధితులకు ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా

పెద్దాపురం: ప్రతి మహిళకు మరింత ఆర్థిక భరోసా కల్పించేందుకే ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తుందని నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీలో భాగంగా మండలంలోని జి.రాగంపేటలో మంగళవారం వెలుగు ఏపీఎం సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారితతో పాటు అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యమిస్తున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. భవిష్యత్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉన్నామని, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం జి.రాగంపేట, వడ్లమూరు, గోరింట, పులిమేరు గ్రామాల డ్వాక్రా సంఘాలకు నాలుగో విడత ఆసరా చెక్కులను అందజేశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఏఎంసీ వైస్ చైర్మన్ బందారు వీరబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, బర్రే రామగోవిందు, తుమ్మల అచ్యుతరామయ్య, ఆయా గ్రామాల స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా నిల్వ చేపల విక్రయాలు!

కొత్తపల్లి: మండలంలోని అన్ని మార్కెట్లలోను నిల్వ చేపలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని చేపల కొనుగోలుదారులు వాపోతున్నారు. ముఖ్యంగా చేపల విక్రయాల్లేని సమయంలో బడా వ్యాపారులు వాటిని చిరు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వాటిని నాలుగైదు రోజులు ఐస్‌లో నిల్వ చేసి, అమ్మకం సాగిస్తున్నారు. ఆది, మంగళవారాలు చేపల విక్రయాలు అధికంగా ఉంటాయి. రూ.200 నుంచి రూ.500 పెట్టి కొనుగోలు చేసిన చేపలు ఇంటికెళ్లి చూసేసరికి దుర్వాసన వస్తున్నాయని కొనుగోలుదారులు చెబుతున్నారు. అమీనాబాదు, ఉప్పాడ, మూలపేట మార్కెట్లలో పాడైన చేపల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో దవులూరి సుబ్బారావు, సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

సామర్లకోట: పెద్దాపురం మండలం జె.తిమ్మాపురం గ్రామంలో పలువురు టీడీపీ కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం పర్యటిస్తున్నారు. దీనిలో భాగంగా జె.తిమ్మాపురానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి రావడానికి ముందుకు రావడంతో ఆ గ్రామ సర్పంచ్ కె దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు బత్తిన రమణమ్మ, ఉపసర్పంచ్ ఆరుమిల్లి శేషారావు ఆధ్వర్యంలో 100 మంది పార్టీలో చేరారు. వీరికి దవులూరి సుబ్బారావు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సామర్లకోట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, చదలాడ సర్పంచ్ అబ్బాయి, గోపు నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమను ప్రేమించు ప్రేమకై..


తన భర్త ప్రేమలో అనుబంధాన్ని పంచుతూ దివ్యాంగుల పాఠశాల నడుపుతున్న సత్య

- ఒక జంట ప్రేమ.. శాంతి వర్ధనం..
- మరో జంట ప్రేమ.. ఎందరికో ఆదర్శం

పెద్దాపురం: అందరూ ఉన్నా ఏదో వెలితి. ఎంతో మంది ఉన్నా ఎవరికోసమో ఎదురు చూపులు.. ఆ ఒక్క గొంతు వినాలని తహతహ.. ఆ మనిషి కనపడితే వెన్నెల కురుస్తున్న భావన. ఆ మనిషి తోడుంటే జీవితం వసంతరాగమే కదా. ఆ అదృష్టం దక్కేది కోటి మందిలో ఏవో కొన్ని జంటలకే. చూడచక్కని జంటలను చూస్తే జాతులు వేరైనా చిలకా గోరింకల్లా ఉంటారనడం లోక రీతి. ఆమె ప్రేమలో అతడు.. అతడే ప్రపంచంగా ఆమెగా జీవితాన్ని సాగిస్తూ ఎన్నో మధురానుభూతులను సొంతం చేసుకున్న వారెందరో. ఆమె నా తోడుంటే ప్రపంచాన్నే ఏలేవాడిని అంటాడు అతడు. అతడు నా జతగాడైతే రుతువులన్నీ వసంతాలే అంటుంది ఆమె. ఇద్దరిదీ ఒకే మాటగా.. ఒకే బాటగా వారు సాధించిన విజయాలెన్నో ఉంటాయి. అటువంటి రెండు జంటల పయనాన్ని చూద్దామా.. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వారికి మనసారా శుభాకాంక్షలు చెప్దామా మరి..

మండలం తిరుపతి గ్రామానికి చెందిన రాయవరపు వీరబాబు చిన్ననాటి నుంచి దివ్యాంగుడైనప్పటికీ ఎన్నో కష్టాలకోర్చి పెద్దాపురంలో ఓ కంప్యూటర్ సెంటర్ నడిపేవాడు. అదే పట్టణానికి చెందిన సత్య ఆ కంప్యూటర్ సెంటర్‌లో పరిచయమైంది. ఆ పరిచయం ప్రేమకు దారితీయడంతో పెద్దల సహకారం లేనప్పటికీ అంగవైకల్యంతో ఉన్న వీరబాబును 2002లో ఆమె ప్రేమ వివాహం చేసుకుంది. సుమారు 20 ఏళ్ల దాంపత్య జీవితంలో వారిరువురి ప్రేమబంధం నేడు ఇరు కుటుంబాలను కలపడమే గాక, మరో వంద మంది దివ్యాంగ పిల్లలను చేరదీసి పులిమేరులో శాంతివర్ధన మానసిక వికలాంగుల పాఠశాలను ఏర్పాటుకు ప్రాణం పోసింది. వారి ఇద్దరి కుమారులకు చక్కటి విద్యా బోధన చేసి, మరో 100 మంది దివ్యాంగులకు ఆశ్రయమిచ్చి ఎంతో మంది ప్రేమకు పాత్రులవుతున్నారు.


21 ఏళ్ల కిందట ఆదర్శ వివాహం చేసుకున్న సత్య, వీరబాబు దంపతులు


ప్రేమ వివాహంతో ఆనందంగా గడుపుతున్న విక్రమ్ కుటుంబ సభ్యులు

వారి ప్రేమ వివాహం ఎంతో ఆదర్శం..

పట్టణానికి చెందిన పిడపర్తి విక్రమ్ శాస్త్రి ప్రస్తుతం న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. కళాశాలలో సహచర విద్యార్థి రేష్మా ఫ్లోరెన్స్‌తో చిగురించిన ప్రేమకు దాదాపు 39 ఏళ్లు. కులాంతర వివాహం చేసుకున్న వారిద్దరిని కుటుంబ సభ్యులు వ్యతిరేకించినా నేడు ఎంతో ఉన్నత స్థాయిలో జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇందుకు కారణం నాటి ప్రేమేనని గర్వంగా చెప్తారు వారు. ఫ్లోరెన్స్ ఆర్టీసీలో ఉద్యోగిగా స్థిరపడగా విక్రమ్ శాస్త్రి న్యాయవాదిగా వారికున్న మానస, హర్షవర్ధన్ ఇరువురు పిల్లలతో చక్కటి జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ఏడో అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి చంద్రమౌళీశ్వరి

పెద్దాపురం: న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్ సదస్సులను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏడో అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అన్నారు. మార్చి 9వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్‌లో భాగంగా మంగళవారం స్థానిక కోర్టు అవరణలో నిర్వహించిన సదస్సుకు సీనియర్ సివిల్ జడ్జి దీపా దైవకృప, జూనియర్ సివిల్ జడ్జి హర్షవర్ధన్‌లతో పాటు ఆమె ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బార్ అసోషియేషన్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సామాన్యులకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఏర్పడిందని, ఇదే చట్టంగా 1995 నవంబర్ 9 నుంచి అమలు అవుతుందన్నారు. దీన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీపీ రాగం కామేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్లు నూతలపాటి అప్పలకొండ, పలువురు న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దగ్ధమైన బోటు తీరానికి తరలింపు


బోటులో మంటలను అదుపు చేస్తున్న నావల్ షిప్ సిబ్బంది

కొత్తపల్లి: సముద్రంలో ఇంజిన్‌లో మంటలు చెలరేగడంతో దగ్ధమైన బోటును మంగళవారం ఉదయం అమీనాబాదు తీరప్రాంతానికి చేర్చారు. ఉప్పాడ సూరాడపేటకు చెందిన సూరాడ రమణ బోటు సోమవారం సాయంత్రం సముద్రంలో వేట సాగిస్తుండగా, ఇంజిన్‌లో మంటలు చెలరేగి, ప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. ఇండియన్ నావల్ షిప్ సిబ్బంది బోటులో మంటలను అదుపు చేయడంతో, తాము ప్రాణాలతో బయట పడ్డామని అందులో ఉన్న 11 మంది మత్స్యకారులు తెలిపారు. నావల్ షిప్ అధికారులు ఎంపీ ఎరిన్, నూకరాజు మంటలు అదుపు చేసి, మత్స్యకారులను మరో బోటుపై సురక్షితంగా తరలించారు. వారికి ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు, బోటును అమీనాబాదు తీరానికి చేర్చడంతో సిబ్బందిని మత్స్యకారులు అభినందించారు.